# విక్టరీ పంచ్ ఎవరిదో?

- వారణాసిలో మోదీ హ్యాట్రిక్ కొడతారా?
- వయనాడ్‌లో ఈ సారి అమేథీ ఫలితమేనా?
- అధిర్‌కు యూసుఫ్ పఠాన్ ఝలక్ ఇస్తారా?
- మాజీ జడ్జి అభిజిత్‌పై ప్రజా తీర్పు ఏంటి?
- శశిథరూర్‌కు ఈ సారి బ్రేక్ పడనుందా?
- ప్రముఖ నేతల స్థానాలపై అందరి దృష్టి

అజయ్

న్యూఢిల్లీ, మార్చి 25: లోక్‌సభ ఎన్నికల సంగ్రామం ఊపందుకున్నది. ఈసారి ఎన్డీయే కూటమికి 400 సీట్లు అనే నినాదంతో బీజేపీ ఎన్నికల బరిలోకి దిగగా, మోదీ సర్కారును గద్దెదింపడమే లక్ష్యంగా ప్రతిపక్ష ఇండియా కూటమి వ్యూహాలు రచిస్తున్నది. ఈ క్రమంలో ప్రముఖులు పోటీచేస్తున్న స్థానాలపై అందరి దృష్టి నెలకొన్నది.

**మోదీ X అజయ్ రాయ్(వారణాసి)**

ప్రధాని నరేంద్ర మోదీ బీజేపీ అభ్యర్థిగా వరుసగా మూడోసారి కూడా ఉత్తర ప్రదేశ్‌లోని వారణాసి నుంచే బరిలోకి దిగుతున్నారు. ఆయనపై యూపీ కాంగ్రెస్ అధ్యక్షుడు అజయ్‌రాయ్ మరోసారి పోటీచేస్తున్నారు. 2014, 2019 లోక్‌సభ ఎన్నికల్లోనూ మోదీని సవాల్ చేసిన అజయ్ రాయ్.. కేవలం మూడో స్థానానికి పరిమితం అయ్యారు. 2019లో సమాజ్‌వాదీ పార్టీ(ఎస్పీ) అభ్యర్థి శాలిని యాదవ్‌పై నాలుగు లక్షలకు పైగా ఓట్ల మెజార్టీతో మోదీ విజయం సాధించారు.

**అధిర్ రంజన్ చౌదరి X యూసుఫ్ పఠాన్ (బహరమ్‌పూర్)**

విపక్ష ఇండియా కూటమిలో భాగస్వామిగా ఉన్నప్పటికీ, పశ్చిమబెంగాల్‌లో కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకొనేందుకు టీఎంసీ నిరాసక్తత వ్యక్తం చేసింది. రాష్ట్రంలోని బహరమ్‌పూర్ స్థానం కాంగ్రెస్ లోక్‌సభా పక్ష నేత అధిర్ రంజన్ చౌదరికి కంచుకోటగా ఉన్నది. ఇక్కడ 1999 నుంచి వరుసగా ఆయనే ఎంపీగా గెలుస్తూ వస్తున్నారు. అయితే ఈసారి టీఎంసీ ఆయనపై ప్రముఖ మాజీ క్రికెటర్ యూసుఫ్ పఠాన్‌ను బరిలోకి దింపింది. క్రికెటర్‌గా యూసుఫ్‌కు ఉన్న క్రేజ్ ఎన్నికల్లో పనిచేస్తుందనే భావనలో మమత పార్టీ ఉన్నది.

**శశిథరూర్ X రాజీవ్ చంద్రశేఖర్ (తిరువనంతపురం)**

కేరళలోని తిరువనంతపురం నుంచి మూడుసార్లు గెలుపొందిన కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్‌ను ఓడించేందుకు బీజేపీ ప్రయత్నిస్తున్నది. ఆయనకు పోటీగా కేంద్ర మంత్రి రాజీవ్ చంద్రశేఖర్‌ను బరిలోకి దింపింది. శశిథరూర్ రాజకీయాల్లో ప్రవేశించిన 2009 నుంచి తిరువనంతపురానికి ఎంపీగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

**అభిజిత్ గంగోపాధ్యాయ్ X దేబాంగ్సు భట్టాచార్య (తామ్‌లుక్)**

పశ్చిమబెంగాల్‌లోని తామ్‌లుక్ నియోజకవర్గంలో పోరు ఆసక్తికరంగా ఉన్నది. ఇక్కడి నుంచి బీజేపీ అభ్యర్థిగా ఇటీవల కలకత్తా హైకోర్టు జడ్జిగా రాజీనామా చేసిన అభిజిత్ గంగోపాధ్యాయ్ పోటీచేస్తున్నారు. ఆయనకు పోటీగా తృణమూల్ సోషల్ మీడియా హెడ్ దేబాంగ్సు భట్టాచార్యను పోటీచేస్తున్నారు. జడ్జి పోస్టుకు రాజీనామా చేసి బీజేపీలో చేరిన అభిజిత్‌పై ప్రతిపక్ష పార్టీలు తీవ్ర విమర్శలు చేశాయి. అభిజిత్‌ను 'హైకోర్టు ధర్మాసనంలో కూర్చొన్న బీజేపీ బాబు'గా సీఎం మమతా బెనర్జీ ఓ సందర్భంగా అభివర్ణించారు.

## కే సురేంద్రన్ X రాహుల్ గాంధీ(వయనాడ్)

అందరి దృష్టిని ఆకర్షిస్తున్న మరో నియోజకవర్గం కేరళలోని వయనాడ్. ఇక్కడి నుంచి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మరోసారి పోటీచేస్తున్నారు. వయనాడ్‌లో ఈ సారి రాహుల్‌ను ఓడించే లక్ష్యంతో బీజేపీ తమ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కే సురేంద్రన్‌కు బరిలో నిలిపింది. ఈయన 2019 ఎన్నికల్లో అలప్పుజ నుంచి పోటీచేశారు. కాగా, గత సార్వత్రిక ఎన్నికల్లో రాహుల్ వయనాడ్‌తోపాటుగా యూపీలోని అమేథీ నుంచి పోటీచేయగా.. అక్కడ స్మృతి ఇరానీ చేతిలో పరాజయం పాలయ్యారు.

# బీజేపీ పొలిటికల్ 'సిన్మా'

- బయోపిక్‌ల పేరిట పలు చలనచిత్రాలు
- కీలక సంఘటనలతో ఇంకొన్ని మూవీస్
- పార్టీకి లబ్ధి చేకూర్చడమే అంతిమ లక్ష్యం
- జాబితాలో వాజపేయీ, ఆర్టికల్ 370, వీర సావర్కర్, జేఎన్‌యూ, ఎమర్జెన్సీ



(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, మార్చి 25 (నమస్తే తెలంగాణ): లోక్‌సభ ఎన్నికల్లో లబ్ధిపొందడమే లక్ష్యంగా బీజేపీ పావులు కదుపుతున్నది. ఓటర్లను ఆకర్షించడం కోసం ఒకవైపు సినీతారలను బరిలోకి దించుతూనే.. ప్రజలపై ప్రభావం చూపించే కొన్ని సినిమాలను వ్యూహాత్మకంగా తెరమీదకు తీసుకువస్తున్నది.. రాజకీయంగా ఆ పార్టీకి ఉపయోగపడే కాన్సెప్ట్‌లతో కొన్ని చలనచిత్రాలు ఈ ఎన్నికల వేళ విడుదలవుతుండటమే దీనికి నిదర్శనం. బీజేపీకి చెందిన నేతలు, సానుభూతిపరులు ఆయా చిత్రాల నిర్మాణంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా పాలుపంచుకొంటుండటం గమనార్హం.

**పొలిటికల్ హీట్ పెంచుతున్న సినిమాలివే!**

**మై అటల్ హూ:** మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజపేయీ జీవితాన్ని ఆధారంగా చేసుకొని ఈ సినిమాను తెరకెక్కించారు. వాజపేయీ వ్యక్తిగత జీవితం, రాజకీయ రంగప్రవేశం, కార్గిల్ యుద్ధం, పోఖ్రాన్ అణుపరీక్ష తదితర కీలక అంశాలను చిత్రంలో చూపించారు.

**ఆర్టికల్ 370:** జమ్ముకశ్మీర్‌కు స్వతంత్ర ప్రతిపత్తినిచ్చే ఆర్టికల్ 370 రద్దు, ఆ తర్వాత జరిగిన పరిణామాల సదృశ్యరూపమే ఈ చిత్రం. అయితే, వాస్తవాలను విస్మరించి కేవలం బీజేపీకి లబ్ధి చేకూర్చే విధంగా చిత్రంలో కొన్ని సీన్స్‌ను వక్రీకరించారన్న విమర్శలు వచ్చాయి.

**స్వతంత్ర వీర్ సావర్కర్:** రణ్‌దీప్ హుడా టైటిల్ రోల్ పోషించిన ఈ చిత్రం బీజేపీ భావజాలాన్ని వ్యాపితం చేయడానికి మాత్రమే ఉద్దేశించిందని విమర్శలు వ్యక్తమయ్యాయి. స్వతంత్ర్య పోరాట వీరుల చరిత్రను వక్రీకరించిందంటూ పలువురు మండిపడ్డారు.

**జేఎన్‌యూ జహంగీర్ నేషనల్ యూనివర్సిటీ:** ఢిల్లీలోని జేఎన్‌యూ యూనివర్సిటీలో 2016, ఆ తర్వాత జరిగిన పరిణామాలను ఆధారంగా చేసుకొని ఈ సినిమాను తీసుకొచ్చారు. విపక్షాలను ముఖ్యంగా లెఫ్ట్ కూటమిని లక్ష్యంగా చేసుకొని ఈ సినిమాను తీసుకొచ్చినట్టు విమర్శలు ఉన్నాయి.

**ఎమర్జెన్సీ:** బీజేపీ నుంచి ఇటీవల ఎంపీ టికెట్ పొందిన బాలీవుడ్ నటి కంగన రనౌత్.. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ పాత్రను పోషించారు. 1975-77 మధ్య విధించిన అత్యయిక స్థితి ఆధారంగా ఈ సినిమా తెరకెక్కినట్టు సమాచారం. కాంగ్రెస్‌ను లక్ష్యంగా చేసుకొనే ఈ సినిమా తీసినట్టు విమర్శలు ఉన్నాయి.

**ఈ సినిమాలు కూడా:** పై చిత్రాలతో పాటు తెలుగులో ఇటీవల వచ్చిన రజాకార్, బాలీవుడ్‌లో తెరకెక్కిన బెంగాల్ 1947, బస్తర్ ది నక్సల్ స్టోరీ, ది సబర్మతీ రిపోర్ట్‌తో పాటు గతంలో వచ్చిన కశ్మీర్ ఫైల్స్, ది కేరళ స్టోరీ చిత్రాల నేపథ్యాలు ఒక విధంగా బీజేపీకి అనుకూలంగా ఉన్నట్టు విమర్శలు వచ్చాయి.

### సినీ గ్లామర్ కూడా..

సినిమాల ద్వారానే కాకుండా సినీ స్టార్లకు టికెట్ ఇవ్వడం లేదా ప్రచారంలో వాడుకోవడం ద్వారా రానున్న లోక్‌సభ ఎన్నికల్లో ఓట్లు రాబట్టేందుకు బీజేపీ సిద్ధమైంది. పొలిటికల్ సినీ తారల జాబితాలో నటి కంగనా రనౌత్, రామాయణ్ సీరియల్ పాత్రధారి అరుణ్ గోవిల్, రేసు గుర్రం విలన్ రవికిషన్, ప్రముఖ నటి హేమామాలిని, మలయాళం నటుడు సురేశ్ గోపీ తదితరులు ఉన్నారు.

### బీజేపీలో చేరిన 'గాలి'

బెంగళూరు, మార్చి 25: మైనింగ్ కింగ్‌గా పేరుగాంచిన కర్ణాటక మాజీ మంత్రి గాలి జనార్ధన్ రెడ్డి తిరిగి బీజేపీలో చేరారు. బెంగళూరులో సోమవారం మాజీ సీఎం యెడియూరప్ప, కర్ణాటక బీజేపీ అధ్యక్షుడు విజయేంద్ర ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గాలి జనార్ధన్ రెడ్డి భార్య అరుణ లక్ష్మి, పలువురు కుటుంబసభ్యులు కూడా బీజేపీ తీర్థం పుచ్చుకొన్నారు. గత ఏడాది అసెంబ్లీ ఎన్నికలకు ముందు తాను స్థాపించిన కర్ణాటక రాజ్య ప్రగతి పక్ష(కేఆర్‌పీపీ) పార్టీని కూడా జనార్ధన్‌రెడ్డి బీజేపీలో విలీనం చేశారు. బీజేపీలో చేరిక అనంతరం గాలి మాట్లాడుతూ సొంత ఇంటికి తిరిగి వచ్చినట్టు ఉందన్నారు. మోదీని మూడోసారి ప్రధానిగా చేసేందుకు తన వంతు ప్రయత్నం చేస్తానని పేర్కొన్నారు. కాగా, గతంలో బీజేపీలో ఉన్న గాలి జనార్ధన్ రెడ్డి.. బీఎస్ యెడియూరప్ప క్యాబినెట్‌లో మంత్రిగా పనిచేశారు. మైనింగ్ కుంభకోణం కేసులో ఆయన జైలు పాలయ్యారు.

## కంప్యూటర్, పేపర్ ఇవ్వకున్నా ఆదేశాలు ఎలా?

**కస్టడీ నుంచి కేజ్రీవాల్ పాలనా ఆదేశాలపై ఈడీ దర్యాప్తు**

కేజ్రీవాల్‌కు మద్దతుగా డీపీ క్యాంపెయిన్

న్యూఢిల్లీ, మార్చి 25: మద్యం పాలసీ కేసులో అరెస్టయిన ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్.. ఈడీ కస్టడీ నుంచే పాలనపరమైన ఆదేశాలు జారీచేయడంపై ఈడీ దృష్టిసారించింది. కేజ్రీవాల్‌కు తాము కంప్యూటర్ కానీ, పేపర్ కానీ ఇవ్వలేదని, అలాంటప్పుడు ఆయన ఎలా ఆదేశాలు జారీ చేశారన్నదానిపై దర్యాప్తు చేస్తున్నది. సీఎం కేజ్రీవాల్ ఈడీ కస్టడీ నుంచే ఆదేశాలు జారీచేశారంటూ ఢిల్లీ మంత్రి ఆతిశీ విలేకరుల సమావేశంలో ఓ నోట్‌ను చదివి వినిపించిన సంగతి తెలిసిందే. రాజధానిలో నీటి సమస్య పరిష్కారానికి కేజ్రీవాల్ సూచనలు చేశారని ఆమె చెప్పారు. ఈ క్రమంలో ఆ నోట్ ఎలా వచ్చిందో మంత్రి ఆతిశీని ఈడీ ప్రశ్నించే అవకాశం ఉన్నట్టు సమాచారం. కాగా, కేజ్రీవాల్‌ను ఈ నెల 28వరకు ఈడీ కస్టడీకి కోర్టు అప్పగించిన విషయం తెలిసిందే.

**కేజ్రీవాల్‌కు మద్దతుగా డీపీ క్యాంపెయిన్**

కేజ్రీవాల్‌కు సంఘీభావం కూడగట్టేందుకు ఆప్ సోషల్ మీడియాను వేదికగా ఎంచుకున్నది. కేజ్రీవాల్‌కు మద్దతుగా ఆప్ నేతలు, కార్యకర్తలు సోమవారం తమ ప్రొఫైల్ చిత్రాలను మార్చారు. కటకటాల వెనుక ఉన్న కేజ్రీవాల్ చిత్రాన్ని డిస్‌ప్లేలో పోస్ట్ చేశారు. మోదీ కా సబ్సే బడా దార్ కేజ్రీవాల్ (మోదీని అత్యంత భయపెట్టిన కేజ్రీవాల్) అనే శీర్షికను డిస్‌ప్లే కింద పోస్ట్ చేశారు. దేశంలో రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు మద్దతునివ్వాలని కోరుతూ ఆప్ ఈ క్యాంపెయిన్ ప్రారంభించింది.

## నీరుగారిన 2జీ కేసు మాదిరిగానే?!

**ఢిల్లీ మద్యం కేసుపై నెట్టింట్లో చర్చ**

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్(నమస్తే తెలంగాణ): దేశంలో రాజకీయ దుమారం రేపి.. ఏడేండ్లపాటు నడిచిన 2జీ స్పెక్ట్రమ్ కేసులో ఎలాంటి కుంభకోణం లేదంటూ 2017లో సీబీఐ కోర్టు తీర్పునిచ్చింది. అయితే, 2010లో 2జీ స్పెక్ట్రమ్ కేటాయింపులపై ఆరోపణలు వచ్చింది మొదలు.. శూన్యంలో స్కామ్‌ను సృష్టించి బీజేపీ రాజకీయ లబ్ధిపొందింది. 2014లో కమలదళం అధికారంలోకి రావడానికి కూడా ఈ కేసు ఓ విధంగా సాయపడింది. చివరకు ఈ కేసులో ఏ రాజా, ఎంపీ కనిమొళి, ఇతరులను నిర్దోషులుగా ప్రకటిస్తూ 2017, డిసెంబర్ 21న సీబీఐ స్పెషల్ కోర్టు తీర్పునిచ్చింది. దీంతో అప్పటివరకూ ఆరోపణలు చేసిన బీజేపీ నేతలు తర్వాత ఏమీ మాట్లాడలేదు. ఇప్పుడు ఢిల్లీ మద్యం కేసులోనూ బీజేపీ వైఖరి ఇలాగే ఉన్నదని, ఈ కేసు కూడా 2జీ కేసులాగే నీరుగారొచ్చని సోషల్‌మీడియాలో చర్చ మొదలైంది. కాగా, 2జీ కేసుపై ప్రత్యేక కోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ 2018లో సీబీఐ దాఖలు చేసిన పిటిషన్‌ను లోక్‌సభ ఎన్నికల సమయంలో ఇటీవల ఢిల్లీ హైకోర్టు విచారణకు స్వీకరించడం గమనార్హం.

## పశ్చిమబెంగాల్ మంత్రికి ఈడీ సమన్లు

కోల్‌కతా, మార్చి 25: పశువుల అక్రమ రవాణా కేసులో పశ్చిమబెంగాల్ మంత్రి చంద్రనాథ్ సిన్హాకు ఈడీ సోమవారం సమన్లు జారీ చేసింది. ఈ నెల 22న నిర్వహించిన సోదాల్లో ఆయన నుంచి స్వాధీనం చేసుకున్న మొబైల్ ఫోన్‌లోని సమాచారం ఆధారంగా ఈ సమన్లు జారీ చేశారు. మంత్రి ఫోన్‌లోని కొన్ని కీలక పత్రాలను పరిశీలించినట్టు ఈడీ తెలిపింది. స్మగ్లింగ్ కేసులో ఇప్పటికే అరెస్టై జైల్లో ఉన్న టీఎంసీ నేత అనుబ్రతా మండల్‌తో సిన్హాకు సాన్నిహిత్యం ఉందని ఈడీ తెలిపింది. ఇటీవల సిన్హా ఇంట్లో చేసిన సోదాల్లో లభించిన రూ.41 లక్షల నగదు గురించి ఎన్నికల సంఘానికి, ఆదాయ పన్ను విభాగానికి సమాచారం ఇచ్చినట్టు చెప్పింది. నగదుకు సంబంధించి సిన్హా సంతృప్తికరమైన సమాధానాలను ఇవ్వలేదని వివరించింది. అయితే దీనిపై స్పందించడానికి సిన్హా నిరాకరించారు.

### స్వతంత్ర అభ్యర్థిగా పన్నీర్ సెల్వం పోటీ

చెన్నై: తమిళనాడు మాజీ సీఎం పన్నీర్‌సెల్వం స్వతంత్ర అభ్యర్థిగా ఎన్నికల బరిలో నిలబడుతున్నారు. రామనాథపురం లోక్‌సభ స్థానం నుంచి నామినేషన్ దాఖలు చేయనున్నారు. అన్నాడీఎంకే పార్టీ జెండా, లెటర్‌హెడ్‌ను నిలబెట్టుకునేందుకు హైకోర్టును ఆశ్రయించగా, ఆ కేసులో ఓడిపోయిన పన్నీర్ సెల్వం బీజేపీతో పొత్తు కుదుర్చుకున్నారు. 39 ఎంపీ స్థానాలకుగాను 16 సీట్లు కోరగా, కేవలం ఒక్క స్థానం ఇవ్వడానికి బీజేపీ అంగీకరించింది. ముస్లింలు ఎక్కువగా ఉన్న రామనాథపురం నుంచి పోటీ చేయాలంటూ ఆయనపై ఒత్తిడి తెచ్చినట్టు సమాచారం. రామనాథపురంలో 2019 ఎన్నికల్లో డీఎంకే మద్దతుతో ఐయూఎంఎల్ అభ్యర్థి 1.27 లక్షల ఓట్ల తేడాతో గెలుపొందాడు. ఈ సారి సిట్టింగ్ ఎంపీ నావాస్, అన్నాడీఎంకే అభ్యర్థి పి జయ పెరుమాల్, పన్నీర్‌సెల్వం మధ్య త్రిముఖ పోటీ ఉంటుందని రాజకీయ నిపుణులు అంచనా వేస్తున్నారు.

# 400 సీట్లిస్తే రాజ్యాంగాన్ని మార్చేస్తాం!

- పీఠికలో లౌకికవాదం అనే పదాన్ని తీసేసి, హిందువులకు అనుకూలంగా తిరగరాస్తాం
- బీజేపీ ఎంపీ అనంత్‌కుమార్ హెగ్డే వివాదాస్పద వ్యాఖ్యలు
- ఎంపీ టికెట్ నిరాకరిస్తూ బీజేపీ అధిష్ఠానం నిర్ణయం
- లోక్‌సభ ఎన్నికల్లో పార్టీకి నష్టం జరుగవద్దనే?!

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, మార్చి 25 (నమస్తే తెలంగాణ): వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని బీజేపీకి 400కు పైగా సీట్లను కట్టబెడితే భారత రాజ్యాంగాన్ని మార్చేస్తామంటూ కర్ణాటక బీజేపీ ఎంపీ, కేంద్ర మాజీ మంత్రి అనంత్‌కుమార్ హెగ్డే ఇటీవల వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. దీనిపై సర్వత్రా విమర్శలు వ్యక్తమయ్యాయి. లోక్‌సభ ఎన్నికలవేళ ఈ పరిణామం బీజేపీకి కొత్త తలనొప్పులు కూడా తీసుకొచ్చింది. దీంతో నష్టనివారణ చర్యలకు దిగిన కమల దళం.. ఉత్తర కన్నడ ఎంపీ టికెట్ ఇవ్వకుండా అనంత్‌కుమార్ హెగ్డేను పక్కనబెట్టింది. ఆ స్థానం నుంచి స్థానిక ఎమ్మెల్యే విశ్వేశ్వర హెగ్డే కగేరీని బరిలోకి దింపింది. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో పార్టీకి నష్టం జరుగకూడదనే ఉద్దేశంతోనే బీజేపీ అధిష్ఠానం ఈ నిర్ణయం తీసుకొన్నట్టు సమాచారం.

**అసలేం జరిగింది?**

రానున్న లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి 400కు పైగా సీట్లు ఇస్తే, హిందువులకు అనుకూలంగా రాజ్యాంగాన్ని మార్చేస్తామని కర్వార్‌లో ఇటీవల జరిగిన ఓ సభలో ఎంపీ అనంత్‌కుమార్ అన్నారు. రాజ్యాంగ పీఠికలో 'లౌకికవాదం' అనే పదాన్ని కూడా తొలగిస్తామన్నారు. 'హిందువులకు అనుకూలమైన రాజ్యాంగం రావాలంటే మోదీ నేతృత్వంలోని బీజేపీకి లోక్‌సభలో అధిక సీట్లు ఇవ్వాలి. బీజేపీకి లోక్‌సభ, రాజ్యసభలతో పాటు రాష్ట్ర ప్రభుత్వాల్లో 2/3 వంతుల మెజార్టీ ఉండాలి' అని పేర్కొన్నారు. ప్రధానంగా హిందూ సమాజాన్ని అణచివేసే లక్ష్యంతో కాంగ్రెస్ గతంలో పలు చట్టాలను తీసుకొచ్చిందని ఆయన ఈ సందర్భంగా మండిపడ్డారు. ఇదంతా మారాలంటే.. ప్రస్తుతం ఉన్న మెజార్టీతో బీజేపీకి సాధ్యం కాదని అన్నారు. తన వ్యాఖ్యలపై వివరణ ఇవ్వాలని హెగ్డేకు ఇటీవలే నోటీసులు పంపించిన బీజేపీ అధిష్ఠానం.. తాజాగా టికెట్‌ను నిరాకరించింది.

### గుర్తు తెలియని వ్యక్తుల దాడిలో ముగ్గురి మృతి

- హోలీ నాడు ఛత్తీస్‌గఢ్‌లో విషాదం

కొత్తగూడెం, మార్చి 25: ఛత్తీస్‌గఢ్‌లోని నక్సల్స్ ప్రభావిత ప్రాంతమైన బీజాపూర్ జిల్లాల్లో సోమవారం సాయంత్రం గుర్తు తెలియని వ్యక్తుల దాడిలో ముగ్గురు వ్యక్తులు మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. హోలీ పర్వదినమైన సోమవారం నాడు సాయంత్రం బాసగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోని బాసగూడ, పున్‌బాక గ్రామాల మధ్య ఈ ఘటన చోటుచేసుకున్నది. హత్యకు దారి తీసిన కారణాలు ఇంకా తెలియరాలేదని పోలీసులు చెప్పారు. మృతులను చంద్రయ్య మోడియామి, అశోక్ భండారీ, కారం రమేశ్‌గా గుర్తించినట్టు తెలిపారు.

**మావోయిస్టుల మెరుపుదాడిలో జవాన్‌కు గాయాలు**

బీజాపూర్ జిల్లా కేంద్రంలోని గోర్నా మంకేలి అటవీ ప్రాంతానికి సమీపంలో మావోయిస్టుల మెరుపుదాడిలో ఓ జవాన్‌కు గాయాలయ్యాయి. అటల్ అవాస్‌లోకి అకస్మాత్తుగా చొరబడిన మావోయిస్టు యాక్షన్ టీమ్ అక్కడి జవాన్లపై దాడికి దిగింది. అలర్టయిన జవాన్లు ఎదురు కాల్పులకు దిగటంతో మావోయిస్టులు పరారయ్యారు. అయితే అప్పటికే మావోయిస్టులు జరిపిన కాల్పుల్లో రిజర్వ్ గార్డ్ విభాగానికి చెందిన దీపక్ దుర్గం అనే జవాన్ తీవ్రంగా గాయపడ్డారు. ఆదివారం సుక్మా జిల్లాలో జరిగిన ఎదురుకాల్పుల్లో మావోయిస్టు ఆవలం పోడియా మృతి చెందాడు. దానికి ప్రతీకారంగానే ఈ ఆకస్మిక దాడి జరిగినట్టు భావిస్తున్నారు.

### రంగుల్లో మునిగి.. సంతోషాల్లో తేలి

*హోలీ సందర్భంగా సోమవారం దేశమంతా రంగుల్లో మునిగి తేలింది! అహ్మదాబాద్‌లోని స్వామి నారాయణ్ ఆలయంలో జరిగిన వసంతోత్సవంలో ఇలా పెద్ద సంఖ్యలో భక్తులు వేడుకల్లో పాల్గొన్నారు. కోల్‌కతాలో చిన్నారులు రంగులు పూసుకొంటూ సందడి చేశారు.*

## ఉజ్జయిని మహాకాళేశ్వర్ గుడిలో అగ్నిప్రమాదం

- భస్మ హారతి ఇస్తుండగా దుర్ఘటన
- 14 మంది పూజారులకు గాయాలు

ఉజ్జయిని, మార్చి 25: ఉజ్జయినిలోని ప్రసిద్ధ మహాకాళేశ్వరుడి గుడిలో సోమవారం ఉదయం అగ్ని ప్రమాదం సంభవించింది. హోలీ సందర్భంగా గర్భ గుడిలో భస్మ హారతి ఇస్తుండగా ఈ దుర్ఘటన జరిగింది. ఈ ప్రమాదంలో సహాయకులతో కలిపి మొత్తం 14 మంది పూజారులు గాయపడ్డారు. వీరిలో 8 మంది పరిస్థితి విషమంగా ఉంది. ఘటన సమయంలో గర్భగుడి బయట పలువురు ప్రముఖులు, ఇతర భక్తులు ఉన్నారు. ఘటనపై న్యాయ విచారణకు ఆదేశించినట్టు జిల్లా కలెక్టర్ నీరజ్‌కుమార్ సింగ్ వెల్లడించారు. కర్ఫూరం ఉన్న పూజా పళ్లెంలో గులాల్ పడటం వల్ల మంటలు చెలరేగి ఉండొచ్చని భావిస్తున్నారు. గాయపడినవారికి రూ.1 లక్ష ఆర్థిక సాయం, ఉచిత వైద్యం అందిస్తామని మధ్యప్రదేశ్ సీఎం మోహన్ యాదవ్ ప్రకటించారు. హోలీ రంగుల వల్ల బాధితుల గాయాలను గుర్తించడం కష్టంగా మారిందని తెలిపారు.

మహాకాళేశ్వర్ గుడిలో అగ్ని ప్రమాదం తర్వాత అలముకొన్న పొగ

### గాజాలో కాల్పుల విరమణకు ఐరాస డిమాండ్

ఐక్యరాజ్యసమితి: ముస్లింల పవిత్ర మాసం రంజాన్ సందర్భంగా గాజాలో కాల్పులను విరమించాలని ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి తొలిసారి డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం తీర్మానాన్ని ఆమోదించింది. అయితే ఓటింగ్‌కు అమెరికా గైర్హాజరైంది. దక్షిణ ఇజ్రాయెల్‌పై గత ఏడాది అక్టోబరు 7న హమాస్ జరిపిన దాడుల్లో బందీలుగా పట్టుకెళ్లిన వారిని విడిచిపెట్టాలని కూడా కోరింది. అయితే బందీలను విడుదల చేస్తేనే కాల్పుల విరమణ జరుగుతుందనే షరతును విధించలేదు. ఐరాస తీర్మానం నేపథ్యంలో ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు అమెరికా పర్యటనను రద్దు చేసుకున్నారు. ఆయన అమెరికా తీరును తీవ్రంగా దుయ్యబట్టారు. హమాస్ వద్ద బందీలుగా ఉన్న ఇజ్రాయెలీయుల విడుదలకు, కాల్పుల విరమణకు ముడి పెట్టకుండా తీర్మానం ఆమోదం పొందడానికి అవకాశం కల్పించిందని మండిపడ్డారు.

### అమెరికాలో అమూల్ పాలు

న్యూఢిల్లీ: అమెరికాలోని భారతీయులకు అమూల్ తాజా పాలు త్వరలో అందుబాటులోకి రాబోతున్నాయి. ఈ పాలను భారత దేశానికి వెలుపల అమ్మబోతుండటం ఇదే తొలిసారి. నాలుగు రకాల అమూల్ తాజా పాలను అమెరికన్ మార్కెట్లో విక్రయించనున్నట్లు గుజరాత్ కోఆపరేటివ్ మిల్క్ మార్కెటింగ్ ఫెడరేషన్ ఎమ్‌డీ జయేన్ మెహతా తెలిపారు. దీనికోసం మిషిగన్ పాల ఉత్పత్తిదారుల సంఘంతో ఒప్పందం కుదుర్చుకున్నామని తెలిపారు. న్యూయార్క్, న్యూజెర్సీ, షికాగో, వాషింగ్టన్, డల్లాస్, టెక్సాస్ తదితర చోట్ల అమూల్ పాలు భారతీయులతోపాటు ఆసియన్లకు మరికొద్ది రోజుల్లో అందుబాటులో ఉంటాయన్నారు.

### బోయింగ్ సీఈవో రాజీనామా

న్యూయార్క్, మార్చి 25: తమ కంపెనీ సీఈవో డేవ్ కల్హౌన్ పదవి నుంచి వైదొలగనున్నారని విమానయాన దిగ్గజం బోయింగ్ సోమవారం ప్రకటించింది. ఆ కంపెనీ విమానాల్లో ఇటీవల వరుస ప్రమాదాలు జరుగుతుండటంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్న వేళ ఈ పరిణామం చోటు చేసుకుంది. మనం మళ్లీ ఉత్తమ కంపెనీగా తిరిగొస్తామని నాకు తెలుసు. మనం చేసే పనుల్లో భద్రత, నాణ్యతకు మొదటి ప్రాధాన్యం ఉంటుంది' అని ఉద్యోగులకు రాసిన లేఖలో కల్హౌన్ పేర్కొన్నారు.

## బెంగళూరులో నీటి వృథాపై జరిమానా

- 22 కుటుంబాలకు రూ.1.1 లక్షల ఫైన్

బెంగళూరు: బెంగళూరులో ఎండాకాలం గడుస్తున్న కొద్దీ నీటి సంక్షోభం కూడా ముదురుతున్నది. తాగేందుకు, ఇతర అవసరాలకు సరిపడా నీరు లేక నగరవాసులు నానా ఇబ్బందులు పడుతున్నారు. తీవ్రమైన నీటి కొరత నేపథ్యంలో తాగునీటిని వృథా చేయొద్దని సూచించిన బెంగళూరు నీటి సరఫరా, మురుగునీటి నిర్వహణ బోర్డు(బీడబ్ల్యూఎస్ఎస్‌బీ) అధికారులు.. తాజాగా తమ ఆదేశాలు ఉల్లంఘించారన్న కారణంతో నగరానికి చెందిన 22 కుటుంబాలపై రూ.5 వేల చొప్పున జరిమానా విధించి వసూలు చేశారు. తాగునీటిని వాహనాల వాషింగ్, గార్డెనింగ్ వంటి పనులకు ఉపయోగించినందుకు ఆయా కుటుంబాలపై జరిమానా వేసినట్టు వెల్లడించారు. నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 22 కుటుంబాల నుంచి రూ.1.1 ల క్షలు వసూలు చేశామని, వాటిలో దక్షిణ ప్రాంతం నుంచే రూ.80 వేలు వచ్చాయని జలమండలి అధికారులు తెలిపారు. తాగునీటిని పొదుపుగా వాడుకోవాలని బీడబ్ల్యూఎస్ఎస్‌బీ ఈనెల మొదట్లో సూచించింది. తాగునీటిని వాహనాలను కడగడం, నిర్మాణాలు, వినోద సంబంధిత కార్యక్రమాలకు వినియోగించద్దంది. తమ ఆదేశాలను ధిక్కరిస్తే జరిమానా విధిస్తామని హెచ్చరించిన బోర్డు.. ఉల్లంఘనను పునరావృతం చేస్తే అదనంగా ప్రతిసారి రూ.500 చొప్పున ఫైన్ చెల్లించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది.

### ముస్లిం ఇచ్చిన 'భారత్ మాతాకీ